

# చీకటికి వెయ్యికళ్ళు

## – కొమ్మూరి సాంబశివరావు



*"ఎవరు చేశారీ హత్య? హంతకుణ్ణి పట్టుకోవాలి. నిజం తెలుసుకోవాలి" అని మంగళ యుగంధర్ని వేడుకుంది.*

*"శవం ప్రక్కన పడున్న పిస్తోలు మీద వేలిముద్రలున్నాయి. హంతకుడు దొరికాడు అరెస్టు చేస్తున్నాను" అన్నాడు ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు.*

*"నీకేమీ భయంలేదు. నిన్ను విడిపించే బాధ్యత నాది" ధైర్యం చెప్పాడు లాయర్ వజ్రాలరావు.*

*మంగళ మర్యాదస్తురాలు. అతడు.. బికారి.. సన్యాసి.. నిందితుడు జైలుకి వెళ్ళి వచ్చిన మాజీ నేరస్థుడు. ఈ ముగ్గురికీ సంబంధం ఏమిటి?*

*లాయర్ వజ్రాలరావు జిత్తులమారి, మేధావి, దొంగలకూ నేరస్థులకూ సన్నిహితుడు.*

*డిటెక్టివ్ యుగంధర్ మొదటిసారి కోర్టులో వాదిస్తాడు. అద్భుతమైన పరిశోధన, సాక్షుల పరీక్ష, క్రాసు పరీక్ష.*

*(గత సంచిక తరువాయి)*

**2**

**డిటెక్టివ్ యుగంధర్ ట్రస్టుపురం చేరుకున్నాడు.** కోడంబాకంలో కొత్తగా తయారయిన కాలనీ అది. ఏ వీధికా వీధికి మొదట్లోనే ఇళ్ళ నెంబర్లు బోర్డుమీద రాసి ఉండడం వల్ల జోగయ్య ఇల్లు తెలుసుకోవడం కష్టం కాదనుకున్నాడు యుగంధర్. మొదటి క్రాస్ రోడ్డులోకి వెళ్ళగానే కారు ఆపి, కాలి నడకన బయలుదేరాడు. ఆరవ క్రాస్ రోడ్ చేరుకున్నాడు. కుడివైపుకి తిరిగి, ఇళ్ళ నెంబర్లు చూసుకుంటూ నడిచాడు. అన్నీ కొత్తగా కట్టిన ఇళ్ళు. చాలా ఇళ్ళు ఇంకా ఖాళీగా ఉన్నాయి. కొన్ని ఇళ్ళకి ఇంకా ఎలక్ట్రిక్ దీపాలు రాలేదు. వీధి దీపాలు కూడా చాలా దూరదూరంగా ఉన్నాయి.

570 నెంబర్ ఇంటిముందు ఆగాడు యుగంధర్. అది చాలా చిన్న ఇల్లు. 'డి' టైపు ఇల్లు. లోపల చిన్న దీపం వెలుగుతోంది. ఇంటి చుట్టూ ఫెన్సింగ్ కానీ, గేటుకానీ లేదు. యుగంధర్ తలుపు తట్టాడు. ఎవరూ పలక్లేదు. మళ్ళీ తట్టాడు.

"ఎవరు?" లోపల్నించి ఓ మొగగొంతు పలికింది.

"జోగయ్యగారి ఇల్లు ఇదేనా?" యుగంధర్ అడిగాడు.

"మీరెవరు?" లోపల్నించి ప్రశ్న.

తనెవరో తెలిస్తేకానీ, ఆ ఇల్లు జోగయ్యది అయినదీ కానిదీ చెప్పదలచుకోలేదని యుగంధర్ గ్రహించాడు.

"నా పేరు చెప్పినా మీకు తెలియదు" అన్నాడు.

"ఏం పని?"

"జోగయ్యగారిల్లిదేనా?" యుగంధర్ మళ్ళీ అడిగాడు.

"ఏం పని?" లోపల్నించి ఆ బొంగురు స్వరం అడిగింది.

"ఆయనతో మాట్లాడాలి" యుగంధర్ కాస్త కోపంగా అరిచాడు.

మంచం మీదనుంచి లేచినట్టు, తలుపువైపు నడుస్తున్నట్లు అలికిడి అయింది. యుగంధర్ తలుపుకి అరడుగు దూరం వెనక్కి జరిగాడు. తలుపు గడియ తీసి, తలుపు తెరిచాడు లోపల మనిషి. "ఎవరు?" అడిగాడు.

"మీరేనా జోగయ్యగారు?" అన్నాడు యుగంధర్.

"అవును, మీరెవరు?" అడిగాడు జోగయ్య.

అతనికి దాదాపు ముప్పయి ఏళ్ళు దాటి ఉంటాయి. పైజమా, షర్టు వేసుకున్నాడు. మాటలు కాస్త ముద్దగా ఉన్నాయి. ఒక చేత్తో తలుపు పట్టుకున్నా నిటారుగా నిలుచోలేకుండా ఉన్నాడు.

"మీతో మాట్లాడడానికి వచ్చాను, లోపలికి రానివ్వండి" అన్నాడు యుగంధర్.

"అక్కర్లేదు. ఇక్కడే నిలుచుని పనేమిటో చెప్పండి" అని అతను అంటూండగానే యుగంధర్ తలుపు సందులో బూటు కాలు పెట్టి చేత్తో జోగయ్యని వెనక్కి ఒక్కతోపు తోశాడు. ఆ తోపుకి జోగయ్య వెనక్కి వెళ్ళాడు. పడిపోకుండా అతను కాళ్ళమీద నిలబడడం చాలా కష్టమైంది. ఆలోగా యుగంధర్ లోపలికి వెళ్ళి, తలుపు మూసి లోపల గడియ పెట్టాడు.

జోగయ్య తేరుకుని, యుగంధర్ని ఉరిమి చూసి, జేబులోకి చెయ్యి పోనిచ్చాడు.

"ఆగు. చెయ్యి జేబులోకి పోనివ్వక" అన్నాడు యుగంధర్, చేతిలో పిస్తోలున్నది.

జోగయ్య బిత్తరపోయి చూస్తున్నాడు.

"జేబులోంచి ఆ పిస్తోలు తీసి ఇటు ఇచ్చెయ్యి. నువ్వు దాన్ని పేల్చినా నాకు తగలదు. తాగి మత్తులో ఉన్న నువ్వు గురిపెట్టలేవు" అన్నాడు యుగంధర్.

జోగయ్య నిర్ఘాంతపోయి, జేబులోంచి పిస్తోలు తీసి యుగంధర్కి ఇచ్చేశాడు.

"నువ్వెవరు?" అడిగాడు మళ్ళీ.

"నే నెవర్నయితే నీకేంగాని, ఆ నెక్లెస్ ఇలా ఇయ్యి" అన్నాడు యుగంధర్.

"ఏ నెక్లెస్?"

"బుకాయించక. ఏ నెక్లెసో నీకు తెలుసు. రామారావు ఇనప పెట్టెలోంచి నువ్వు దొంగిలించిన వజ్రాల నెక్లెస్."

"ఇదేదో కథలా ఉంది. ఏమిటీ దౌర్జన్యం? నెక్లెసేమిటి? అసలు నువ్వెవరు? నీ మొహం ఎక్కడో చూసినట్టున్నది" అని జోగయ్య కళ్ళుమూసుకుని ఒక క్షణం ఆలోచించాడు.

"ఎందుకు శ్రమపడతావు. నేనెవరయితే నీకేం! నెక్లెస్ ఇలాతే. మంగళాదేవి చెప్పింది అంతా. ఇనప పెట్టె తాళంచెవి నీకివ్వడం, నువ్వు ఆమె భర్త రామారావు ఇంట్లోంచి నెక్లెస్ దొంగిలించుకు రావడం - పదివేలు రూపాయలు ఇస్తే కానీ అది ఇవ్వననడం-"

జోగయ్య యుగంధర్ని ఓరకంటితో చూశాడు. "ఆ! ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. డిటెక్టివ్ యుగంధర్ కదూ! మీ ఫోటో పత్రికలలో చూశాను. మళ్ళీ చెప్పండి. నెక్లెసేమిటి? మీకెవరు చెప్పారు" అడిగాడు.

"మంగళాదేవి నాకు జరిగిందంతా చెప్పింది."

"అదేమిటో నాకు చెప్పండి" అన్నాడు జోగయ్య, అతని పెదిమలమీద చిరునవ్వు వెలిగింది.

"తన భర్త ఇంట్లో ఇనపపెట్టెలో ఉన్న నెక్లెస్‌ని దొంగిలించి తీసుకువచ్చి తనకివ్వమని ఇన్పపెట్టె తాళం చెవి నీకు ఇచ్చిందామె. నువ్వు సరేనని ఆ తాళం చెవి తీసుకున్నావు. ఇవాళ పొద్దున్న ఆమెని కలుసుకుని పదివేల రూపాయలు ఇస్తే నెక్లెస్ ఇస్తానన్నావు. ఇవ్వకపోతే నెక్లెస్ అమ్ముకుంటానన్నావు."

"అలాగా?" అన్నాడు జోగయ్య పరధ్యానంగా.

"ఏం? అబద్ధమా!" అడిగాడు యుగంధర్.

"నిజమే! అయినా మంగళ కాని, మీరు కాని చేయగలిగిందేముంది? పదివేలు ఇచ్చి నెక్లెస్ తీసుకోవాలి. లేదా నోరు మూసుకు ఊరుకోవాలి"

"ఊరుకోనవసరంలేదు జోగయ్యా నిన్ను జైల్లో పెట్టించగలను" అన్నాడు యుగంధర్.

జోగయ్య నవ్వుతూ "సాక్ష్యం ఏమున్నది? ఆమె నాకు ఇనపపెట్టె తాళం చెవి ఇచ్చిందని రుజువేంటి? ఆ మాటకు వస్తే నేను ఇనుప పెట్టె జోలికే వెళ్ళలేదనీ, అందుకు అవకాశం లేదనీ రామారావు నా తరపున సాక్ష్యం ఇస్తాడు" అన్నాడు.

"అంత సులభంగా తప్పించుకోలేవు జోగయ్యా! నీమీద ఇప్పుడు పోలీసులకి రిపోర్టు ఇవ్వను. కాచుకునుంటాను. నువ్వు ఆ నెక్లెస్‌ని అమ్మడానికి, అందులో ఒక్క వజ్రం అమ్మడానికి ప్రయత్నం చేసినా పట్టుబడతావు. ఈ క్షణం నుంచీ నీ జీవితం దుర్భరం చేస్తాను. రాత్రనక, పగలనక నీ వెంట నీడల్లా నా మనుషులుంటారు. నువ్వు నిద్రపోతే నీ మంచం కింద నా మనిషి ఒకడు దాక్కుంటాడు. నువ్వు రైలు ఎక్కితే నీతో పాటు రైలు ఎక్కుతాడు. వెంటాడడంలో బాగా శిక్షణ పొందిన నా మనుష్యులని తప్పించుకోలేవు. వాళ్ళు నీ వెంటవుండగా నెక్లెస్ అమ్మలేవు. అమ్మావా వెంటనే పట్టుకుంటారు. నీ వెంట నా మనుష్యులు నీడల్లా తిరిగితే నువ్వెంతకాలం భరిస్తావో నేను చూస్తాను."

"సరే! చూద్దాం. నాకు నిద్రవస్తోంది. ఇక మీరు వెళ్ళండి. గొప్పవారు నా ఇంటిని పావనం చేసినందుకు థాంక్సు" అని జోగయ్య యుగంధర్‌కి తలుపు చూపించాడు.

యుగంధర్ వెనక్కి తిరుగుతున్నట్లు తిరుగుతూ, పిడికిలిని బిగించి జోగయ్యని బలంగా గెడ్డం కింద కొట్టాడు. ఆ దెబ్బకి జోగయ్య కట్టె విరిగినట్లు నేలమీద కూలాడు. యుగంధర్ పెదిమలు బిగించి, ఒంగి జోగయ్య నాడి చూశాడు. తనలో తను నవ్వుకుంటూ తన పని ప్రారంభించాడు.

ఇల్లంతా గాలించాడు. ఏ ఒకచోటూ విడవకుండా వెతికాడు. ఆఖరికి బూట్సు లోపలా, తూముల సందుల్లో, బాయిలర్ నీళ్ళల్లో, పరుపుల లోపలా అంతా వెతికాడు. నెక్లెస్ ఎక్కడా కనిపించలేదు. జోగయ్య పడున్న చోటికి వచ్చాడు. అతను అప్పుడే కళ్ళు తెరవబోతున్నాడు. చకచక అతని జేబులు వెతికాడు. నెక్లెస్ కనిపించలేదు.

జోగయ్య నవ్వాడు. "నెక్లెస్ దొరకలేదా?" అడిగాడు లేచి కూర్చుంటూ.

"ఇంతటితో తప్పించుకున్నావనుకోక జోగయ్యా నిన్ను నీడలా వెంటాడడానికి ఈ రాత్రే మనుష్యులను పంపిస్తాను. ఇకనుంచి నీకు క్షణం శాంతి లేకుండా చేస్తాను. కాచుకో" అని యుగంధర్ బయిటికి నడిచాడు. వీధిలోకి వెళ్ళి వెనక్కి తిరిగి చూశాడు జోగయ్య కిటికీలోంచి తననే చూస్తున్నాడు. యుగంధర్ చరచర నడుచుకుంటూ వీధి మలుపు తిరిగాడు. మలుపు తిరిగి ఆగాడు. తన వెనక జోగయ్య వస్తున్నాడేమోనని అడుగుల చప్పుడు కోసం చెవులు నిక్కబొడుచుకుని విన్నాడు. ఎటువంటి శబ్దమూ లేదు. మరికొంత దూరం నడిచి అయిదవ క్రాస్‌రోడ్లోని ఇళ్ళ పెరళ్ళు కనిపిస్తున్నాయి. ఆ ఇళ్ళని లెక్కపెట్టుకుంటూ నడిచాడు. ఒక ఇంటి పెరడు దగ్గిర ఆగాడు. ఆ

ఇంటికి ఫెన్సింగ్ కానీ, కాంపౌండు గోడకానీ లేదు. దరిదాపులలో వీధి దీపం లేదు. చీకటిగా ఉంది. ఆ చీకట్లో కలసిపోయాడు యుగంధర్. ఆ ఇంటి గోడపక్కగా ముందుకు వెళ్ళాడు. గోడకి అనుకుని పక్క నిలబడ్డాడు. మునివాకిలి వైపు చూస్తున్నాడు.

జోగయ్య ఓ చిన్న తోలుపెట్టె తీసుకుని బయటికి వచ్చాడు . తలుపు తాళం వేసి వాకిలిమెట్లు దిగాడు. వీధిలోకి వెళ్ళబోతుండగా యుగంధర్ వెనకనుంచీ వచ్చి బలంగా మెడమీద ఒక దెబ్బకొట్టాడు. జోగయ్య కిందపడ్డాడు. అతని చేతిలో ఉన్న తోలుపెట్టె కింద పడ్డది. ఆ తోలుపెట్టె తాళం వేసి ఉంది. జోగయ్య జేబులోంచి తాళంచెవులగుత్తి తీసి తోలుపెట్టె తెరిచాడు. గుడ్డలు, టూత్ బ్రష్, సోపు మొదలయిన సామానులు ఉన్నాయి అందులో.

యుగంధర్ తనలో తను నవ్వుకున్నాడు. తన పాచిక పారింది. జోగయ్య బెదిరిపోయి వెంటనే పలాయనం కావడానికి ప్రయత్నిస్తాడనుకున్నాడు తను. అందుకే వెళ్ళి తన మనుష్యులని పంపిస్తానని చెప్పాడు. తోలుపెట్టె అడుగున ఒక చిన్న అట్టపెట్టె వుంది. యుగంధర్ దాన్ని తెరిచాడు.

మిలమిల మెరిసిపోతూ వజ్రాల నెక్లెస్ కనిపించింది. నవ్వుకుంటూ యుగంధర్ ఆ అట్టపెట్టె జేబులో వేసుకున్నాడు.

జోగయ్య కళ్ళు తెరిచాడు. మూలుగుతూ లేచి కూర్చున్నాడు. "యుగంధర్ నువ్వు చాలా తెలివైనవాడివి అనుకుంటున్నావు కదూ! నువ్వు ఫూల్‌వి" అన్నాడు కసితో.

యుగంధర్ నవ్వాడు. "నీ ఇష్టం వచ్చినట్టు తిట్టుకో గుడ్‌నైట్" అని మొదటి మెయిన్ రోడ్ దగ్గర ఆపిన తన కారు దగ్గరికి చకచక నడిచాడు.

●●●

యుగంధర్ తిరిగి కన్సల్టింగ్ రూంలోకి వెళ్ళేటప్పటికి మంగళ "పేషలాన్" ఆడుకుంటోంది. అది ఒక్కరు ఆడుకునే పేకాట. యుగంధర్ని చూడగానే నవ్వి "మీరు రావడానికి ఇంకా ఆలస్యం అవుతుందనుకుంటున్నాను" అన్నది లేచి నిలుచుంటూ.

ఆమెని కూర్చోమని సంజ్ఞ చేసి తన రివాల్వింగ్ కుర్చీలో కూర్చున్నాడు యుగంధర్.

"జోగయ్య కనిపించాడా?" అడిగిందామె.

యుగంధర్ తలూపాడు.

"ఏమన్నాడు?"

యుగంధర్ జేబులోంచి అట్టపెట్టె తీశాడు. దాన్ని బల్లమీద పెట్టి మంగళ కందేట్లు ముందుకు తోశాడు. ఆ పెట్టె తెరిచింది. ఆశ్చర్యంతో యుగంధర్ని చూసింది. "ఎలా తెచ్చారు? ఎలా ఇచ్చాడు?" అడిగింది.

"ఎలా తెస్తేనేం? తెచ్చాను చాలదూ" అన్నాడు యుగంధర్.

మంగళ నవ్వింది. "చాలు" అని ఒక క్షణం ఆగి, హేండ్ బాగ్ తెరిచి, అందులోంచి ఒక నోట్ల కట్ట తీసింది. నెమ్మదిగా ఆ కట్ట బల్ల మీద పెట్టి, లేచి నిలుచుంది. "నేను వస్తాను. మీకు ధన్యవాదాలు" అన్నది. యుగంధర్ బల్లమీద వున నోట్లకట్టని చూసి "ఏమిటిది?" అన్నాడు.

"మీ శ్రమకి" అన్నది.

యుగంధర్ బల్లమీద నోట్లకట్ట తీసుకున్నాడు. నింపాదిగా లెక్కపెట్టాడు. ఆమె వైపు తిరిగి, "వెయ్యి" అన్నాడు. ఆమె తల ఊపింది. కుర్చీలోంచి లేచి ఆమె దగ్గరికి వెళ్ళి ఆమె చేతిలో ఉన్న హేండ్ బాగ్ తీసుకుని, అందులో ఆ నోట్లకట్టని పెట్టి, బాగ్ మూసేసి ఆమెకి ఇచ్చాడు.

"అమ్మాయి! నువ్వేమీ ఇవ్వనవసరంలేదు. ఇకముందు ఇటువంటి చిక్కుల్లో ఇరుక్కోకుండా జాగ్రత్తగా ఉండు. న్యాయం నీ వేపు ఉన్నా అడ్డదారులు మంచివి కావు అనేది జ్ఞాపకముంచుకో!" అన్నాడు. ఆమె యుగంధర్‌కి నమస్కారం చేసింది. "ఎన్నడూ మీ సహాయం మరచిపోను" అన్నదామె వెళ్ళిపోతూ. బయట కారు స్టార్టు అయిన శబ్దం విన్నాక యుగంధర్ కన్సల్టింగ్ గదిలో దీపం ఆర్పి పడక గదిలోకి వెళ్ళాడు.

3

మర్నాడు పొద్దున్న యుగంధర్ తన కన్సల్టింగ్ గదిలోకి వచ్చేటప్పటికి అతని అసిస్టెంటు రాజు టెలిఫోనులో ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

"ఒక్క క్షణం. ఇప్పుడే యుగంధర్‌గారు గదిలోకి వచ్చారు. చెపుతాను ఉండండి" అన్నాడు. టెలిఫోను నుంచి మొహం పక్కకి తిప్పి, యుగంధర్ని చూసి, టెలిఫోనులో ఎవరో పిలుస్తున్నారని సంజ్ఞ చేశాడు.

"ఎవరు?" అడిగాడు యుగంధర్.

మౌత్‌పీస్ మీద చెయ్యి అడ్డం పెట్టి, "ఎవరో పేరు చెప్పడంలేదు. మీతో మాట్లాడాలిట." అన్నాడు రాజు.

యుగంధర్ రిసీవర్ అందుకున్నాడు. "ఎస్ యుగంధర్ స్పీకింగ్ హియర్" అన్నాడు.

అవతలనుంచి చిన్న నవ్వు వినపడింది.

"యుగంధర్! నువ్వు ఫూల్‌నని ఇప్పటికయినా తెలిసిందా?" నవ్వుతూ అవతలివైపునుంచి ఒక మొగ గొంతు అడిగింది.

యుగంధర్ కనుబొమలు చిట్లించి, "నువ్వెవరు?" అడిగాడు.

"ఎవరయితేనేం? రామారావు భార్య మంగళని ఆమె ఇంటికి వెళ్ళి ఒకసారి చూసిరా, నువ్వెంత పెద్ద ఫూల్‌వో తెలుస్తుంది."

యుగంధర్ మరేమీ అడక్కముందే అవతలివైపు రిసీవర్ పెట్టేసినట్లు క్లిక్ మని శబ్దం అయింది.

యుగంధర్ ఆలోచిస్తూ రిసీవర్ హుక్ మీద పెట్టి కుర్చీలో కూర్చున్నాడు.

"ఎవరు సార్?" అడిగాడు అసిస్టెంటు రాజు.

"ఎవరో చెప్పలేదు. కానీ ఊహించవచ్చు. అతని పేరు జోగయ్య."

"ఏమంటారు?"

"కథ అంతా చెబితే కాని నీకు అర్థంకాదు. ముందు మనం ఒకచోటికి వెళ్ళాలి. దోవ చెబుతాలే." అన్నాడు యుగంధర్.

క్రిజ్లర్ కారు యుగంధర్ డ్రయివ్ చేస్తున్నాడు. రాజు పక్కనే కూర్చున్నాను. క్రితం రాత్రి జరిగినదంతా విపులంగా రాజుకి చెప్పాడు యుగంధర్.

"ఇంతకీ జోగయ్య ఇప్పుడు ఏమంటాడు?" అడిగాడు రాజు.

"నేను ఫూల్ అయ్యానని అంటున్నాడు."

"ఎందుకని?"

"అదే తెలుసుకోవాలి" అని యుగంధర్ అన్నామలైపురంలో ఒక ఇంటిముందు కారు ఆపాడు.

"ఇదెవరి ఇల్లు?" అడిగాడు రాజు.

"రామారావు ఇల్లు."

కారు దిగి ఇద్దరు డిటెక్టివ్‌లూ గేటు దగ్గరికి వెళ్ళారు.

గేటు దగ్గిర ఉన్న ఆల్సేషియన్ కుక్క మొరగలేదు. కానీ చెవులు నిక్కపొడుచుకుని వాళ్ళని చూసింది. యుగంధర్ గేటుమీద చప్పుడు చేశాడు. లోపలినుంచి ఒకతను బయటికి వచ్చాడు. నింపాదిగా గేటు దగ్గిరికి వచ్చి యుగంధర్‌నీ, రాజునీ ఎగాదిగా చూశాడు.

"రామారావుగారి ఇల్లు ఇదేనా?" అడిగాడు యుగంధర్.

"అవును."

"ఇంట్లో ఉన్నారా?"

"ఉన్నారు - నిద్రపోతున్నారు." అన్నాడు అతను.

"నువ్వేం చేస్తుంటావు ఈ ఇంట్లో?" అడిగాడు యుగంధర్.

"డ్రయివర్ని."

"అమ్మగారు ఇంట్లో ఉన్నారా?"

"లేరు."

"ఎక్కడికి వెళ్ళారు?"

"ఏమో?"

"అసలు ఇక్కడ ఉండటంలేదా?"

"ఏమో?" అన్నాడు ఆ డ్రయివర్.

యుగంధర్ జేబులోకి చెయ్యి పోనిచ్చి, ఓ అయిదు రూపాయల నోటు తీశాడు. "నేను మంగళ మేనమామని." అన్నారు.

"అలాగా!"

"మంగళ ఎక్కడున్నది?"

"నాకు తెలీదు" అన్నాడు డ్రయివర్.

"చెబితే ఇది నీది" అని యుగంధర్ నోటు చూపించాడు. ఆ డ్రయివర్ ఒక క్షణం సందేహించాడు. "నుంగంబాకంలో ఉన్నారు" అని చెప్పాడు చివరికి.

"ఎడ్రసు?"

"రామన్ స్ట్రీట్, నెం.190"

"థాంక్స్" అని యుగంధర్ ఆ నోటు అతనికి ఇచ్చి వెనక్కి తిరిగాడు.

సరిగ్గా పదిహేను నిమిషాల తర్వాత క్రిజ్లర్ కారు రామన్ స్ట్రీటులో నెం.190 ఇంటిముందు ఆగింది. గేటు తెరుచుకుని యుగంధరూ, రాజూ లోపలికి వెళ్ళారు. తలుపు లోపల గడియ పెట్టివుంది.

యుగంధర్ తలుపు తట్టాడు. ఒక స్త్రీ వచ్చి తలుపు తీసింది.

"మంగళాదేవిగారి ఇల్లు ఇదేనా?" అడిగాడు యుగంధర్.

ఆమె తల ఊపింది.

"ఉన్నారా?"

"మీరెవరు?"

"నా పేరు యుగంధర్."

"కూర్చోండి. చెబుతాను." అని హాల్లో ఉన్న కుర్చీలు చూపించి ఆమె లోపలికి వెళ్ళింది. ఆమె వంటమనిషి అయి ఉండాలనుకున్నాడు యుగంధర్.

అయిదు నిమిషాల తర్వాత ఒక స్త్రీ హాల్లోకి వచ్చింది. కత్తిరింపు జుట్టు. కొసలు ఉంగరాలు తిరిగి చుట్టలుగా వేళ్ళాడుతున్నాయి. చీర కొంగు మేలిముసుగు వేసుకుంది. లేత నీలిరంగు జార్జెటు చీర కట్టుకున్నది. బూడిద రంగు క్రేప్ జాకెట్టు తొడుక్కుంది. ఎర్రటి ఒంటిరంగు. గుండ్రని మొహం, నల్లని లోతు కళ్ళు, చిన్న నోరు, అందమైన పెదిమలు ఎర్రగా మెరుస్తున్నాయి. చాలా నెమ్మదిగా నడుస్తూ యుగంధర్ దగ్గరకి వచ్చింది.

యుగంధర్ లేచినిలుచునాడు, "నా పేరు యుగంధర్. మంగళాదేవిగారిని కలుసుకోవడానికి వచ్చాను" అన్నాడు.

"కూర్చోండి. ఏం పనిమీద వచ్చారు?" అడిగిందామె.

ఆమె గొంతులో అదొక రకమైన వణుకున్నది. భయం వల్లకాని, బెదిరిపోవడంవల్ల కాని కలిగింది కాదు - సహజమైన ఒణుకు అది. కొంచెం బొంగురుగా ఉన్న ఆమె కంఠస్వరం ఆ ఒణుకువల్ల వినేందుకు చాలా ఇంపుగా ఉన్నది.

"మీరేనా మంగళాదేవిగారు?" అడిగాడు యుగంధర్.

ఆమె తల ఊపింది. యుగంధర్ ఓసారి ఆమెని ఎగాదిగా చూశాడు. క్రితం రాత్రి తనవద్దకు వచ్చిన స్త్రీని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. ఆమెకీ, ఈమెకీ పోలిక చాలా ఎక్కువ. ఈమెలో ఠీవీ, దర్పమూ గోచరిస్తున్నాయి. తన సౌందర్యం ప్రతి కదలికలోనూ ప్రదర్శించాలని ఈమె ప్రయత్నించడంలేదు. విచారమూ, ఒక రకమైన వైరాగ్యమూ ఈమెలో గోచరిస్తున్నాయి. ఆమె కూర్చోలేదు. నిలుచునే యుగంధర్ని ప్రశ్నార్థకంగా చూసింది.

"మీకూ, మీ భర్త రామారావుగారికీ మధ్య కలతలు కలిగి విడిగా ఉంటున్నారా?"

ఆమె తల ఊపింది.

"లక్ష రూపాయలు విలువగల నెక్లెస్ మీకున్నదా?"

ఆమె తల ఊపింది.

"అది మీ దగ్గరే ఉన్నదా?"

"లేదు. మావారి దగ్గరున్నది. నాకివ్వలేదు. విడాకులకి దావా వేశాను. దానితో పాటు నా నగలకోసమూ దావా వేశాను" అన్నదామె. ఒక క్షణం ఆగి "మిమ్మల్ని గురించి చాలా విన్నాను. మీ వృత్తిలో మీ కన్నా మించినవారు ఈ దేశంలో లేరని విన్నాను. మీలాటి వారిని కలుసుకునే భాగ్యం కలిగినందుకు చాలా సంతోషంగా ఉంది. అయినా ఈ ప్రశ్నలన్నీ ఎందుకు అడుగుతున్నారు? మా ఆయన తరపున పని చేస్తున్నారా?"

"లేదు. నేనే అడుగుతున్నాను."

"నా విడాకుల విషయంతో మీకేం సంబంధం" అడిగిందామె.

యుగంధర్ నవ్వాడు.

"నిన్న రాత్రి నా ఆఫీసుకి ఓ స్త్రీ వచ్చింది. మీకూ, ఆమెకి చాలా పోలిక ఉంది. తన పేరు మంగళ అనీ, తను రామారావుగారి భార్యననీ చెప్పింది -" యుగంధర్ జరిగినదంతా ఆమెకి చెప్పాడు. ఆమె అంతా సావధానంగా విన్నది.

"ఆమె ఎవరు? ఎందుకు అలా చేసింది?" అడిగాడు యుగంధర్.

మంగళ పెదిమ విరిచి "ఏమో!" అన్నది.

"మీరు ఊహించలేరా?"

"ఏమో! మా వారి ప్రేయసి ఎవతో అయివుండవచ్చు. లేదా దాసీది అయి ఉండవచ్చు. ఎవరయితే నాకేం?" అన్నదామె.

"పోయింది మీ నెక్లెస్ కదా!" అడిగాడు యుగంధర్.

"ఆ నెక్లెస్ నా వద్దనుంచి దొంగలింప బడలేదు. దాన్ని నాకివ్వవలసిన బాధ్యత మా వారిది. అది పోతే దాని ఖరీదు వారు నాకివ్వాలి."

"మీకు ఇచ్చేందుకు ఆయన దగ్గర అంత డబ్బున్నదా?"

"లేకపోయినా ఇబ్బంది లేదు. ఆ నెక్లెస్‌ని ఇన్సూర్ చేశారు" అన్నది మంగళ.

యుగంధర్ ఒక నిమిషం మౌనంగా ఉండి తర్వాత "నేను చాలా ఇరుకులో పడ్డాను. దొంగలకి సహాయం చేశానా అని భయంగా ఉంది" అన్నాడు.

ఆమె నవ్వింది. "మీ ఇబ్బందులు మీ స్వవిషయాలు. వాటిని పరిష్కరించగలిగే సమర్థత మీకుంది అనుకుంటాను" అని లేచి నిలుచున్నది.

ఆమె ఏదో దాస్తున్నదని యుగంధర్‌కి అనుమానం కలిగింది. ఆమెని ఇంకేం అడిగినా జవాబు చెప్పదని గ్రహించాడు. గట్టి మనిషిలా కనిపించిందామె.

యుగంధర్ లేచాడు. "వస్తాను, బహుశా మిమ్మల్ని మళ్ళీ కలుసుకోవలసి రావచ్చు" అన్నాడు.

ఆమె నవ్వి ఊరుకున్నది.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments